క్లుప్తంగా

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న స్నేహితులు

పత్తికొండ రూరల్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మండల పరిధిలోని మద్రిమాన్‌తండాకు చెందిన భీముడునాయక్ కుటుంబానికి స్నేహితులు ఆర్థిక సాయం అందజేశారు. పత్తికొండ ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియెట్ 2000–02బ్యాచ్ పూర్వ విద్యార్థులు శనివారం గ్రామానికి వెళ్లి తమ స్నేహితుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.30 వేల నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు.

రసవత్తరంగా జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

కృష్ణగిరి: దివంగత నేత చెరుకులపాడు నారాయణరెడ్డి జ్ఞాపకార్థం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. శనివారం కృష్ణగిరి జట్టుపై అమకతాడు, రామాపురంపై కంబాలపాడు జట్లు గెలుపొందినట్లు నిర్వాహకులు శివారెడ్డి, మహేష్, హరీష్‌రెడ్డి, మనోహర్, పవన్‌కళ్యాణ్ తెలిపారు. లీగ్ దశ మ్యాచ్‌లు ముగిశాయని ఆదివారం నుంచి క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు ప్రారంభమవుతాయని వారు తెలిపారు.

రూ.55,116 విరాళం



కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న భక్తురాలు సుశీలమ్మ

ఆలూరు: పట్టణ కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీబెళ్లగుండ ఆంజనేయస్వామి విగ్రహ పునప్రతిష్టాపనకు భక్తురాలు పి.సుశీలమ్మ, ఆమె కుమారుడు అంజి, కోడలు శ్వేత శనివారం రూ.55,116 నగదును విరాళమిచ్చారు. దాత కుటుంబసభ్యులను ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు సన్మానించారు. ఈసందర్భంగా పి.సుశీలమ్మ మాట్లాడుతూ తన భర్త రిటైర్డ్ ఆర్‌ఐ నరసింహులు జ్ఞాపకార్థం విరాళమిచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు శ్రీనివాసరెడ్డి, రఘునాథ్‌రెడ్డి, ప్రకాష్, మల్లి, శ్రీనివాసులు, నాగేంద్రయ్యశెట్టి పాల్గొన్నారు.

జీఓ నం–1 రద్దు చేయాలి

వెల్దుర్తి: ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన జీఓ నం–1ను తక్షణమే రద్దు చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు బలరాం గౌడ్, సీపీఐ మండల కార్యదర్శి టి.కృష్ణ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం వారు విడివిడిగా నిర్వహించిన కార్యక్రమాల్లో జీఓ ప్రతులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు ఐజయ్య, రామచంద్రుడు, బజారి, రాంబాబు, రాఘవేంద్ర, సీపీఐ చిన్న మాదులు, మద్దిలేటి, ఏఐఎస్ఎఫ్ అడవి రాముడు, గోపి పాల్గొన్నారు.

బాలయేసు పుణ్యక్షేత్ర మహోత్సవాలు



పూజలందుకుంటున్న బాలయేసు

మద్దికెర: బాలయేసు మహోత్సవాలను శనివారం క్రైస్తవులు భక్తితో నిర్వహించుకున్నారు. ఉదయం 6 గంటలకు స్తుతి ప్రార్థనలు, దివ్య సత్ప్రసాద ఆరాధన, వ్యాధి గ్రస్తుల కోసం ప్రార్థనలు చేశారు. సాయంత్రం బాలయేసు స్వరూపాన్ని గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు.

క్రికెట్ పోటీల విజేత సీసంగుంతల



విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

తుగ్గలి: సంక్రాంతి పండుగ పురస్కరించుకుని తలారి రాముడు ఆధ్వర్యంలో మారెళ్లలో నిర్వహించిన టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. పోటీల్లో 35 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్స్‌లో జోన్ మండలం సీసంగుంతల జట్టు–మారెళ్ల జట్టుపై గెలిచింది. విన్నర్స్‌కు పెండేకల్లు ఆర్‌ఎస్ ఈడిగ నరేష్ రూ.30వేలు, రన్నర్స్‌కు సీనియర్ జర్నలిస్టు కొలుట్ల యాదవ్ రూ.20వేలు, మూడవ స్థానంలో నిలిచిన మారెళ్ల లయోలా స్కూల్ జట్టుకు ఎస్‌బీఐ సీఎస్‌పీ మల్లికార్జునరెడ్డి రూ.10వేలు, నాలగవ స్థానంలో నిలిచిన ఎద్దులదొడ్డి తేజ జట్టుకు జనసేన కార్యకర్తలు రూ.5వేల నగదు బహుమతులు అందజేశారు.

భోగి సంబరం.. అంబరం

భోగి సంబరాలు అంబరాన్నంటాయి. చిన్నాపెద్దా తేడా లేకుండా వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. తెల్లవారుజామున భోగి మంటలతో పల్లెలు వెలిగిపోయాయి. మహిళలు, యువతులు మంగళ స్నానాలాచరించి ఇళ్ల ముంగిట కల్లాపి చల్లి.. రంగురంగుల ముగ్గులు వేసి వాటిపై గొబ్బెమ్మలు పెట్టి అలంకరించారు. నువ్వులు కలిపిన సజ్జ రొట్టెలు, ఆలు తదితర కూరగాయలతో స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. గంగిరెద్దుల వారికి, హరిదాసులకు దానాలు చేశారు. సాయంత్రం చిన్నారులకు రేగు పండ్లు, చెరకు ముక్కలు, చాక్లెట్లు, చిల్లర నాణేలు కలిపి పోసి దీవించారు.



వెల్దుర్తిలో భోగి మంటలు వేసుకుని సంబరాలు చేసుకుంటున్న దృశ్యం



పత్తికొండలో సంక్రాంతి సంబరాల్లో సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తున్న ప్రజలు

కృష్ణగిరి: తెలుగింట మూడురోజుల సంప్రదాయ పండుగ సంక్రాంతిని మండల వ్యాప్తంగా ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారు. శనివారం మొదటి రోజు భోగి సందర్భంగా గ్రామాల్లో గంగిరెద్దుల నాట్యాలు కనువిందుచేశాయి. చిన్నారులు గాలిపటాలను ఎగురవేసి సంబరాలు చేసుకున్నారు.

పత్తికొండ రూరల్: సీపీఎం ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో స్థానిక నాలుగు స్తంభాల కూడలిలో సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. పండుగ ప్రాధాన్యతను వివరిస్తూ ప్రజానాట్యమండలి కళాకారులు పాటలు, నాటికల ద్వారా ప్రజలను ఆకట్టుకున్నారు.

వెల్దుర్తి: మండల కేంద్రంలో భోగి మంటల చుట్టూ చిన్నా పెద్దా సందడి చేశారు. సాయంత్రం ఇష్టదైవాలను పూజించుకున్నారు. చిన్నారులు గాలిపటాలు ఎగురవేస్తూ కనిపించారు. అక్కడక్కడా దూడూ బసవన్నలు కనిపించాయి.



కృష్ణగిరి మండలంలో గాలిపటాలు ఎగురవేస్తున్న చిన్నారులు

మద్దికెర: మండల వ్యాప్తంగా మహిళలు చలిని లెక్కచేయకుండా ఉదయమే లేచి ఇంటి ముంగిట ముత్యాల ముగ్గులు వేశారు. ఇంటిల్లిపాది పండుగను సంబరంగా జరుపుకున్నారు.

తుగ్గలి: భోగ భాగ్యాలు తెచ్చే భోగి పండుగను శనివారం మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఇంట్లో ఉన్న పాత వస్తువులను వేసి భోగి మంటల్లో వేసి చలి కాచుకున్నారు.

ఆస్పరి: మండలంలోని ఆస్పరి, చిరుమాన్‌దొడ్డి, హలిగేర, శంకరబండ, జొహరాపురం, చిగిళి, బిణిగేరి గ్రామాలలో శనివారం భోగి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గాయత్రీ మాత, జనార్ధన స్వామి, రామలింగేశ్వర స్వామి, చింతలముని స్వామి, నల్లారెడ్డి స్వాముల ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

నందవరం: సంక్రాంతి పండుగ సంబరాల్లో భాగంగా మొదటి రోజు శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో భోగి వేడుకలు నిర్వహించుకున్నారు. నువ్వుల వంటలు చేసి దేవతమూర్తులకు నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మండల కేంద్రంతో పాటు నాగలదిన్నె, కనకవీడు, ముగతి, జొహరాపురం, గురజాల, ఇబ్రహీంపురం తదితర గ్రామాల్లో భోగి పండుగను వైభవంగా జరుపుకున్నారు.

గోనెగండ్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో భోగి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మహిళలు తమ ఇళ్ల ముందు ముగ్గులు వేయడంలో పోటీ పడ్డారు. అనంతరం ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.

పశు బీమాను సద్వినియోగం చేసుకోవాలి

నందవరం: పాడి రైతులు వైఎస్సార్ పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యుడు నరేంద్రనాథ్ రెడ్డి సూచించారు. శనివారం మండల పరిధిలోని జొహరాపురం గ్రామంలో పాడి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పశువులను సంరక్షించాలనే ఉద్దేశంతో పశు అంబులెన్స్, ఎద్దులు, పశులకు బీమా సౌకర్యం కల్పించిందన్నారు. పాడి రైతులు ప్రభుత్వం అందించే పథకాలను వినియోగించుకోవాని కోరారు. అలాగే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. బీమా వర్తించాలంటే పశువులకు ట్యాగ్‌లు వేయించుకోవాలన్నారు. పశువులతో పాటు ఎద్దులకు కూడా ప్రభుత్వం బీమా వర్తింపజేసిందన్నారు. త్వరలో బీమా విధి విధానాలు ప్రవేశపెట్టనుందని, పశువులకు ట్యాగ్ వేయించుకోవాలని వివరించారు.



పాడి రైతులతో మాట్లాడుతున్న పశువైద్యుడు నరేంద్రనాథ్‌రెడ్డి

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు

ఆలూరు రూరల్: గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చర్యలు తీసుకుంటామని ఆలూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఈశ్వరయ్య హెచ్చరించారు. శనివారం సాయంత్రం ఆయన మండలంలోని మరకట్టు గ్రామంలో పర్యటించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వ్యక్తులపై నిఘా ఉంచామన్నారు. అక్రమ మద్యం తయారీ, విక్రయించే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామస్తులందరూ అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉండాలని సూచించారు.



మరకట్టు గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ ఈశ్వరయ్య

దేవనకొండలో మకర జ్యోతి దర్శనం



దేవనకొండలో అయ్యప్పస్వామి ఆలయంలో మకర జ్యోతి దర్శనం

ఆలూరు: మండల కేంద్రమైన దేవనకొండలోని అయ్యప్పస్వామి ఆలయం ఆవరణంలో శనివారం భక్తులకు మకర జ్యోతి దర్శనం లభించింది. ఆలయ భక్త మండలి సభ్యులు, అయ్యప్పస్వామి మాలధారులు మూడు ఆకాశ దీపాలను వెలిగించి వదిలారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ దీపాలను మకర జ్యోతిలాగా భావించి తిలకించి తరించారు.

నిరుపయోగంగా పాత పోలీస్ స్టేషన్ భవనం



పాత పోలీస్ స్టేషన్

హొళగుంద: మండల కేంద్రంలోని పాత పోలీస్ స్టేషన్ భవనం నిరుపయోగంగా ఉంది. బ్రిటీష్ కాలంలో నిర్మించిన ఈ భవనం ఇప్పటికీ చెక్కుచెదరలేదు. ఈ భవనాన్ని పోలీస్‌స్టేషన్‌కు ఉపయోగించేవారు. కొంతకాలం క్రితం కొత్తగా నిర్మించిన భవనంలో పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయడంతో పాత భవనం ఖాళీగా నిరుపయోగంగా ఉంది. గ్రంథాలయానికి సొంత భవనం లేదు. నెలకు రూ.2 వేలు చెల్లించి అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. ఇలాంటి నిరుపయోగంగా ఉన్న భవనాలను ఉపయోగించుకుంటే ప్రభుత్వానికి ఆర్థిక భారం తగ్గుతుందని పలువురు పేర్కొంటున్నారు.

ముగ్గులు సంప్రదాయానికి ప్రతీక

పత్తికొండ రూరల్: సంక్రాంతి ముగ్గులు తెలుగు సంప్రదాయానికి ప్రతీకలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య అన్నారు. శనివారం చదువుల రామయ్య భవన్ ఆవరణంలో సీపీఐ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మొదటి, రెండవ, మూడవ విజేతలు లక్ష్మినిఖిత, సునిత, మేఘనలకు పార్టీ నాయకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు భీమలింగప్ప, రాజాసాహెబ్, సురేంద్ర, క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతి అందిస్తున్న పి.రామచంద్రయ్య

కమనీయం గోదా, రంగనాథుల కళ్యాణం





స్వామివార్ల కళ్యాణం, రంగనాథ ఆలయంలో గోపూజ నిర్వహిస్తున్న అర్చకులు రంగస్వామి

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో శ్రీరంగనాథుడు, గోదాదేవి అమ్మవార్ల కళ్యాణోత్సవం శనివారం సాయంత్రం కమనీయంగా సాగింది. తెల్లవారుజామున అర్చకులు గోపూజ నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మ వార్ల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. పండితులు గోదాదేవి, శ్రీరంగనాథస్వామి వార్ల ఉత్సవమూర్తులను పెళ్లిపీటలపై కొలువుంచి మంత్రోచ్ఛారణలు, భక్తాదుల మధ్య కళ్యాణం జరిపించారు. గ్రామపురవీధుల గుండా ప్రభోత్సవం నిర్వహించారు.

బహుమతులు ప్రదానం

ఎమ్మిగనూరు టౌన్: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఎస్టీయూ ఆధ్వర్యంలో పట్టణంలోని ఉర్దూ ఉన్నత పాఠశాలలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన అనిత, కృష్ణవేణి, నవనీతకు శనివారం ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నరాజు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరించిపోతున్న సంప్రదాయాలను నేటి యువతకు తెలియజేసేందుకు ముగ్గుల పోటీలు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో ఉర్దూ పాఠశాల హెచ్ఎం కోటప్ప, ఎస్టీయూ నాయకులు బసవరాజు, వెంకటేశ్వర్లు, తిమ్మన్న, రామచంద్ర, లక్ష్మీనారాయణ, ఎల్లప్ప, నాగభూషణం, శేఖర్, చంద్రశేఖర్, వెంకటరాముడు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్న రాజు

శ్రీ మఠంలో భక్తుల సందడి



భక్తులకు సప్త ముద్రా ధారణ చేస్తున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం : రాఘవేంద్ర స్వామి మఠంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. సంక్రాంతి సెలవులు కావడంతో భక్తులు తరలివస్తున్నారు. తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్ర ప్రాంతా ల నుంచి అత్యధికంగా వస్తున్నారు. భక్తుల రాకతో శనివారం శ్రీ మఠం వీధులు కిటకిటలాడాయి. ఇదిలా ఉండగా.. క్షేత్రంలో జరుగుతున్న వంద, 200 గదుల సముదాయాలు, మ్యూజియం పనులను పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు తనిఖీ చేశారు. అన్నపూర్ణ భోజనశాలలో అన్న ప్రసాదాన్ని పరిశీలించారు.

జీవనపోరాటం

జీవి ఏదైనా బతికేందుకు తిండి అవసరం. ఆ తిండి సంపాదించుకోవడం కోసం నిరంతరం పోరాడుతూనే ఉండాలి. నాట్లు వేసి వేతనం సంపాదించుకుని పొట్టపోసుకునే పనుల్లో మహిళలు ఉండగా.. ఆహారం వెతుక్కునే పనిలో కొంగలు బిజీగా ఉన్నాయి. ఈ దృశ్యాలు హొళగుంద సమీపంలోని తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ) పరిసర ప్రాంతాల్లో శనివారం కనిపించాయి. ఒక వైపు జోరుగా సాగుతున్న వరి నాట్లు.. మరో వైపు తెల్లకొంగల ఆహార వేట దృశ్యాలు చూపురులను ఆకట్టుకుంటున్నాయి.

– హొళగుంద



వరి మడుల్లో ఆహారం కోసం ఒకే చోట చేరిన తెల్ల కొంగలు





నాట్లు వేస్తున్న దృశ్యం

18 నుంచి నల్లగుండ్లలో కబడ్డీ పోటీలు

తుగ్గలి: మునిస్వామి ఉరుసు ఉత్సవాలు పురస్కరించుకుని నల్లగుండ్లలో ఈనెల 18 నుంచి రెండు రోజుల పాటు కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు శనివారం గ్రామస్తులు తెలిపారు. పోటీలలో గెలుపొందిన మొదటి నాలుగు జట్లకు వరుసగా రూ.20,016, రూ.15,016, రూ.10,016, రూ.5,016 నగదు బహుమతులి అందజేయనున్నట్లు వెల్లడించారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 6300392085, 9182997930 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని మద్రిమాన్ తండా సమీపంలో శనివారం పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్ట్ చేసినట్లు సీఐ మురళీమోహన్ తెలిపారు. పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడులు నిర్వహించామన్నారు. పేకాటరాయుళ్ల నుంచి రూ.22 వేల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

పారిశుధ్య పనులు

హొళగుంద: మండల పరిధిలోని గజ్జహళ్లిలో శనివారం సర్పంచ్ ఆరుబట్ల నాగమ్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. వీధులు, డ్రైనేజీలలో పేరుకుపోయిన చెత్తచెదారాన్ని, మురుగునీరును సిబ్బందితో తొలగించారు. దోమలు, వ్యాధులు ప్రబలకుండా చెత్తకుప్పలను తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు.

పందుల బెడద



వీధిలో సంచరిస్తున్న పందులు

గోనెగండ్ల: మండల కేంద్రంలో పందుల బెడద అధికమైంది. చాకలివీధి, ఎస్సీ కాలనీ, కురువగేరి, చింతలముని ఆలయం ప్రాంగణం, మొట్టివీధి, కింది గేరి, సంతమార్కెట్, పాఠశాలలు, ప్రధాన కూడళ్ల వద్ద పందులు విచ్చలవిడిగా తిరుగుతూ చిన్నారులపై దాడులు చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. పందుల యజమానులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వదిలేస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలువురు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి పందులను మండల కేంద్రానికి దూరంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన ధనుర్మాస పూజలు

హొళగుంద: మండల కేంద్రంలో వెలిసిన సిద్దేశ్వర స్వామికి శనివారం ధనుర్మాస ముగింపు పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక రుద్రాభిషేక పూజలు నిర్వహించారు. అంతకుముందు స్వామికి జలాభిషేకం, ఆకు పూజ, కుంకుమార్చన, బిల్వార్చన, పంచామృతాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు రాజపంపన్నగౌడ్, శివశంకర్‌గౌడ్, సిద్దార్థగౌడ్, ఆలయ అభివృద్ధి, దాసోహ కమిటీ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని రూరల్ : కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని, 30 కర్ణాటక మద్యం బాక్సులను స్వాధీనం చేసుకున్నామని సెబ్ సీఐ హరికృష్ణ శనివారం విలేకరులకు తెలిపారు. ఆదోని సెబ్ అధికారులు జరిపిన దాడుల్లో బల్లేకల్ గ్రామ క్రాస్ రోడ్డు వద్ద తోవి గ్రామానికి చెందిన వీరేష్, రచ్చుమర్రి గ్రామానికి చెందిన వీరేష్, ఉరుకుంద అనే వ్యక్తులు ఒక కారు, ఒక మోటార్ సైకిల్‌పై 30 కర్ణాటక మద్యం బాక్సులు రవాణా చేస్తుండగా అరెస్టు చేసి, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఎస్ఐలు శివప్రసాద్, రోహిణి, సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.